

# హైదరాబాద్ వార్త

## అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిపై కలెక్టర్ ఆదేశాలు



**హైదరాబాద్ ఆగస్టు 1, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టినందుకు అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ డీఈఓలు, డిప్యూటీ ఐఓయస్‌లు, డీఈలతో అమ్మ ఆదర్శ పాఠశాల పురోగతికై చర్చించారు. జిల్లాలో 384 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టగా, ఇప్పటివరకూ 235 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయనీ, ఇంకా 149 పాఠశాలల్లోని పనులు పురోగతిలో ఉన్నాయని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో చేపట్టిన మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర మరమ్మత్తులన్నిటినీ డీఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు క్షేత్రస్థాయిలో నాణ్యత ప్రమాణాలకై పరిశీలించి నిర్ధేశించిన వ్యవధిలో వేగవంతంగా పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం విద్యాశాఖపై కలెక్టర్ సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పంపిణీ చేసిన నోట్ పుస్తకాలు, టెక్స్ట్ బుక్స్, యూనీఫార్మ్ వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని చెప్పారు. పాఠశాలకు గైర్‌హాజరవుతున్న పిల్లలతోనూ, వారి తల్లిదండ్రులతోనూ ప్రత్యేకంగా మాట్లాడమని సూచించారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, గణితం, ఉర్దూ వంటి సబ్జెక్టులపై పిల్లలందరికీ పట్టు సాధించే విధంగా అక్షరాస్యత పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారిణి ఆర్.రోహిణీ, డిప్యూటీ డీఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, ఇతర ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# నగరంలో పార్కింగ్ దోపిడీ

**-వాణిజ్య సముదాయాల్లో జోరుగా సాగుతున్న దందా**
**-మల్టీప్లెక్స్‌లు, షాపింగ్ మాల్స్,థియేటర్లలో అడ్డుగోలుగా వసూలు**
**-ప్రభుత్వ నిబంధనలను ఉల్లఘిస్తున్న వ్యాపారులు**
**-అక్రమ వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిహెచ్ఎంసి కమిషనర్ హెచ్చరిక**



**హైదరాబాద్,ఆగస్టు 1,ప్రభాతవార్త:**
నగరంలో సినిమాలకు వెళ్ళినా..షాపింగ్‌కు వెళ్ళినా..పార్కులకు, మార్కెట్‌లకు ఎక్కడికి పోయినా మొదటగా చెల్లించాల్సింది పార్కింగ్ ఫీజులే, ఒక్కోచోట ఒక్కోరకం వసూళ్ళు..ఈ పార్కింగ్ దందా అక్రమమని తెలిసినా నిర్వాహకులు యథేచ్ఛగా ప్రజలను దోపిడీ చేస్తున్నారు. మల్టీప్లెక్స్‌లు, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్లలో అయితే మరీ దారుణం. టూవీలర్స్ రూ30, ఫోర్‌వీలర్స్ రూ.60 ఇలా ఎంత అడిగితే అంత చెల్లించాల్సిందే. ఎందుకు పార్కింగ్ ఫీజు కట్టాలంటూ అక్కడున్న వారిని నిలదీస్తే సమాధానం చెప్పేవారుండరు.పార్కింగ్ నిర్వాహకులే వాహనదారులపై దాడి చేసే పరిస్థితులు ఉంటాయి. దీంతో చాలా మంది ధైర్యం చేయడంలేదు. దౌర్జన్యంగా వసూలు చేస్తున్నారంటూ పోలీసులకు చెబితే..తమకు సంబంధం లేదు జీహెచ్ఎంసీ చూసుకుంటుందని అంటున్నారు. ఇటీవల మరికొందరు ఇక అడుగు ముందుకు వేసి..పార్కింగ్ టికెట్‌తో పాటు జీఎస్‌టీ అంటూ మరింత అదనంగా బాధుడు మొదలు పెట్టారు. అయితే మూడు కమిషనరేట్ల పరిధిలో అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు ఇప్పుడు వీటిపై కూడా దృష్టి పెట్టారు. బాధితులు ధైర్యంగా వెళ్ళి పోలీసులకు ఫిర్యాదు చేస్తుండటంతో కేసులు నమోదు చేస్తున్నారు. కమర్షియల్ భవనాలు (షాపింగ్ మాల్స్,మల్టీప్లెక్స్‌లు, సినిమా థియేటర్‌లు, ఇతర వాణిజ్య సముదాయాలు) తప్పని సరిగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. వీటితో పాటు రెసిడెన్సియల్ అపార్ట్‌మెంట్లలోను పార్కింగ్ స్థలాలను విక్రయించడం, లీజుకు ఇవ్వడం కూడా మున్సిపల్ నిభందనలకు విరుద్ధమే. ఈ స్థలాలను లీజుకుగానీ, పెయిడ్ పార్కింగ్‌లుగా కానీ వినియోగించరాదు. అక్కడికి వచ్చే ప్రజల సౌకర్యార్థం ఉచితంగా అందుబాటులో ఉంచాలి. కానీ ఇందుకు విరుద్ధంగా నగరంలోని చాలా కమర్షియల్ కాంప్లెక్స్ లలో పార్కింగ్ వసూళ్ళు చేస్తున్నారు. అయితే అపార్టుమెంట్ పార్కింగ్ ఫీజు అక్రమమని, ఈ విషయాన్ని న్యాయస్థానాలు కూడా తీర్పు చెప్పాయని అయినా చాలా మంది భవన యజమానులు, ఆయా కాంప్లెక్స్ నిర్వాహకుల వైఖరి మారడం లేదని యథేచ్ఛగా పార్కింగ్ ఫీజులను వసూలు చేస్తున్నారని, ట్రాఫిక్ విభాగానికి చెందిన ఓ ఐపిఎస్ అధికారి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### పార్కింగ్ స్థలాలను వ్యాపారానికి ఉపయోగించవద్దు..

జీహెచ ఎంసీ యాక్ట్ ప్రకారం ఆయా భవనాలకు వచ్చే వారికి అనువైన పార్కింగ్ స్థలం చూపించాలని, దానిని పబ్లిక్ ప్లేస్‌గా చూపించాలనే నిబంధన ఉంది. 2012లో ప్రభుత్వం తెచ్చిన జీవో 168లోని బిల్డింగ్ నిబంధనల ప్రకారం 44శాతం కామన్ ఏరియాగా వదిలేయాల్సి ఉంటుంది.ఏపీ టీస్, అపార్టుమెంట్ చట్టం 1987లోని బిల్డింగ్ నిబంధనల ప్రకారం ఈ కామన్‌ఏరియాను అమ్మడం, లీజుకివ్వడం, దుర్వినియోగం చేయడం నిషేదం. ఇలాంటి విషయాలలో ప్రభుత్వం తగు రాయితీని సైతం అందిస్తుంది. ఖాళీ స్థలంలో బిల్డర్‌లు ఎలాంటి ప్రయోజనాలను పొందకూడని నిబంధనలు సూచిస్తున్నాయి.కానీ భవన యాజమాన్యాలు తమ ధనార్జనే ధ్యేయంగా పెట్టుకుని ఖాళీ ప్రంతాలలో ఏర్పాటు చేసే పార్కింగ్‌లతో పాటు ఇతర చిన్న చిన్న వ్యాపార సముదాయాలను లీజులకు ఇస్తూ లక్షల డబ్బులు సంపాదిస్తున్నారు. ఖాళీ స్థలాన్ని తమ స్వప్రయోజనాలకు ఉపయోగిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అక్రమ పార్కింగ్ వ్యవహారాలపై హైకోర్టు సైతం గతంలో సీరియస్ అయ్యింది.

### పార్కింగ్ ఫీజు వసూలు చేస్తే కఠిన చర్యలు : జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి

జిహెచ్ఎంసి పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజుల వసూలు చేస్తున్న మాల్స్, మల్టీప్లెక్స్ లపై చర్యలకు ఉపక్రమించినట్లు జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి తెలిపారు నగరంలోని పలు మాల్స్, మల్టిప్లెక్స్, సినిమా థియేటర్లలో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి పార్కింగ్ ఫీజుల వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ,అట్టి విషయంపై తనిఖీలు చేసేందుకు ప్రత్యేకంగా టీమ్స్ వేసినట్లు తెలిపారు. సంబంధిత తనిఖీలల్లో కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్దంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వెల్లడైందన్నారు. సింగల్ స్క్రీన్ థియేటర్ కింద రిజిస్టర్ చేసుకుని ,మల్టిపుల్ స్క్రీన్ నడిపిస్తున్నట్లు బయటపడిందన్నారు. అదేవిధంగా అక్కడ ఫుడ్ స్టాల్స్ ను తనిఖీ చేయగా కొన్నిచోట్ల ఫుడ్‌స్టాల్‌లలో అమ్ముతున్న తినుబండారాలు నాణ్యత లేనివిగా గుర్తించినట్లు తెలిపారు.

## దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**-ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**
**-పబ్లిక్ హెల్త్‌డైరెక్టర్ రవీందర్ నాయక్**



డెంగీ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్, జిహెచ్ఎంసి ఛీఫ్ ఎంటాలజీ డా.రాంబాబు తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 1,ప్రభాతవార్త:**
దోమల నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పబ్లిక్ హెల్త్‌డైరెక్టర్ రవీందర్ నాయక్ పిలుపునిచ్చారు. జిహెచ్ఎంసి ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో బంజారాహిల్స్ లోని పాఠశాల, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ,ఎన్‌బిటి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యార్థులు, కాలనీవాసులకు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా నివారణ, దోమల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా బంజారాహిల్స్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో డెంగ్యూ అవగాహనలో భాగంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రవీంద్ర నాయక్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటినిల్వతో దోమల ఉత్పత్తి జరుగుతందన్నారు. వారానికోసారి ఇంట్లో, డ్రమ్స్, బిందెలు, బకెట్లు తదితరాలల్లో నీటిని మార్చాలని ,నీటి నిల్వ ఉన్న పాత్రలపై మూతలు పెట్టాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంట్లో దోమలు ఉండే పనికిరాని వస్తువులు తీసివేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌బిటి నగర్‌లో డెంగ్యూ బాధితుల ఇళ్లను సందర్శించి జ్వర బాధితుల గురించి వాకబ్‌చేసి సంబంధితులకు తీసుకోవాల్సిన చికిత్సలు, జాగ్రత్తలను వివరించారు. డెంగ్యూ టెస్టులు ఎక్కడ చేయించుకుంటున్నారు ? ఎప్పటినుంచి డెంగ్యూతో బాధపడుతున్నారు తదితరాల విషయాలను అడిగి ఆరా తీశారు. ప్రభుత్వ ఆస్పత్రులల్లో ఉచిత చికిత్సలు, మందులు అందజేయడం జరుగుతుందని, డాక్టర్ల పర్యవేక్షణ ఉంటుందని ,ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందాలని సూచించారు. పిమ్మట బంజారాహిల్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోజవారీ ఓపి, జ్వరం కేసులు,డెంగ్యూ కేసులు రికార్డులను పరిశీలించి వివరాలను సంబంధిత వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దోమల నివారణకు,డెంగ్యూ తదితర వ్యాధుల నియంత్రణకు తీసుకున్న చర్యలు గురించి ఛీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు, డిఎంఅండ్‌హెచ్‌వో డా.వెంకట్‌లు పబ్లిక్ హెల్త్‌డైరెక్టర్‌కు వివరించారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజీ రజిని తదితరులు పాల్గొన్నారు.

## ఒ.యూలో ఎమ్మార్పీఎస్ నాయకులు, విద్యార్థులు సంబురాలు



ఒ.యూలో మాట్లాడుతున్న సోమశేఖర్ మాదిగ ఇతర నేతలు

**తార్నాక, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్లలో వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు హక్కును ఇస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన సందర్భంగా గురువారం ఒ.యూలో ఎమ్మార్పిఎస్ నాయకులు పటాకులు కాలుస్తూ, సంబురాలు చేసుకున్నారు. వివిధ విద్యార్థి సంఘాలతో పాటు పలువురు వేర్వేరుగా సంబురాలు జరుపుకున్నారు. ఒ.యూ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆద్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ మాట్లాడుతూ మూడు దశాబ్దాల మాదిగల కల నెరవేరిందన్నారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్ల దండోరా ఉద్యమంలో యావత్తు మాదిగ జాతీ బిడ్డల త్యాగం వెలకట్టలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ.మల్లేశం, ప్రొ.కొర్రెముల శ్రీనివాస్, ప్రొ.విజయలక్ష్మి, డిబిఎస్ఏ అధ్యక్షుడు నలిగంటి శరత్ చమర్, అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, కార్యదర్శి పల్లెర్ల సుధాకర్, తాళ్ల అజయ్, వేల్పుల సంజీవ, జలపాల మహేష్, జంగిలి ధర్శన్, రఘువరన్, మందరాజు, బంజారి విజయ్ మాదిగ, రామారపు శ్రీనివాస్, రాజీవ్, ప్రదీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### ఆపరేషన్ ముస్కాన్‌లో 651 మంది బాలకార్మికులకు విముక్తి

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:**
ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయసులో రెక్కలు ముక్కలు చేస్కుంటూ కష్టపడుతున్న 651 మంది బాల కార్మికులకు ఆపరేషన్ ముస్కాన్ ద్వారా విముక్తి లభించింది. తప్పిపోయి, బిక్షమెత్తుకుంటూ, రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ, వివిధ పనుల్లో శ్రమజీవులుగా కష్టపడుతున్న బాల కార్మికులను గుర్తించి దుర్భర పరిస్థితి నుంచి విముక్తి చేయడానికి జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ 10 నిర్వహించినట్లు సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాశ్ మహంతి తెలిపారు. 651 మంది బాలల్లో 618 మంది అబ్బాయిలు, 33 మంది ఆడపిల్లలు ఉన్నారనీ, వీరందరిలో 11 మంది భిక్షాటనలో ఉన్నట్లు చెప్పారు. పనికెళ్ళే పసిపిల్లలను గుర్తించే క్రమంలో సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ విభాగంలోని పోలీసులతో పాటు, ఉమన్ ఎండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ బృందం సాయంతో 11 పోలీసు బృందాలు విధి నిర్వహణలో గాలింపు చర్యలు చేపట్టారన్నారు. బాలకార్మికులకై వివిధ పరిశ్రమల్లోనూ, కంపెనీల్లోనూ తనిఖీలు నిర్వహించిన పోలీసు బృందాలు, భిక్షమెత్తుకుంటున్న పిల్లలను దర్పణ్ యాప్ సాయంతో ట్రేస్ చేసినట్లురు. మానవుల అక్రమ రవాణా మీద కూడా ఏహెచ్‌టీయు బృందాలు దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. బాల కార్మికులు, భిక్షాటన చేసే పిల్లలు ఎవరికైనా కనిపించినా, మానవుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసినా తక్షణమే పోలీసులకు సమాచారమిచ్చే క్రమంలో 100కు గానీ, 9490617444 కు గానీ డయల్ చేసి సమాచారమందించమని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అత్యాచారం కేసులో శివాజీరెడ్డి అరెస్టు



నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న ఎసిపి కాశిరెడ్డి

**వనస్థలిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త :**
వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో మరో నిందితుడు శివాజీరెడ్డి అలియాస్ చింటురెడ్డిని బుధవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేసారు. సోమవారం రాత్రి హోటల్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై జరిగిన అత్యాచారం కేసులో మంగళవారం ఎడ్ల గౌతంరెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో నిందితుడు శివాజీరెడ్డి పరారీలో ఉన్నాడు. కగా బుధవారం అర్ధరాత్రి శివాజీరెడ్డిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. శివాజీరెడ్డి అలియాస్ చింటురెడ్డి చౌటుప్పల్ మండలం ఆరెగూడెం నివాసి. గతంలో వార్డు సభ్యుడిగా పని చేసిన శివాజీరెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని తెలిసింది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పలు కార్యక్రమాల్లో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడం విశేషం.

### ఫుట్‌పాత్‌లు క్లియర్ చేయాలి

**-జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ ఉన్నతాధికారుల సంయుక్త పర్యటన**



ఎన్ఎఫ్‌సిఎల్ వద్ద అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి

**పంజగుట్ట,ఆగస్టు 1 (ప్రభాతవార్త):**
రద్దీ ప్రాంతాలలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు జరుగకుండా, సుందరీకరణ చేపట్టితగిన చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. గురువారం ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డేతో కలసి పంజగుట్ట నాగార్జున సర్కిల్ నుంచి సోమాజీగూడ చౌరస్తా వరకు పర్యటించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ ఎన్ఎఫ్‌సీఎల్ సర్కిల్ నుండి సోమాజీగూడ చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని, ఫుట్‌పాత్‌లపై గ్రీనరీ ఎక్కువగా ఉండే విధంగా చూడాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీచేశారు.అదేవిధంగా పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాట్లు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.ఈ రహదారిలో నిత్యంముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రులు, గవర్నర్‌తో సహా అత్యంత ప్రముఖులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రముఖులురాకపోకలు ప్రయాణించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయో గమనించి ఒక ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలనిఅధికారులను ఆదేశించారు. సమస్య పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులతో పాటు ఇతర శాఖల అధికారులు కూడాతగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు.ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై పచ్చదనం పెంచడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వివరించారు. జీహెచ్ఎంసీ ఫుట్‌పాత్‌ల ప్లాన్ ప్రకారం అన్నీ క్లియర్‌చేస్తున్నామని ఆయన తెలిపారు.పర్యటనలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### చనిపోయిన వ్యక్తి లేచి కూర్చున్నాడు..

**-నిమ్స్ వైద్యులు డెత్ సర్టిఫికెట్ ఇచ్చారంటూ సోషల్ మీడియాలో వార్తలు**
**-అది ఫేక్ వార్త అని నిర్ధారించిన నిమ్స్ యాజమాన్యం**

**పంజగుట్ట, ఆగస్టు1 (ప్రభాతవార్త):**
చనిపోయిన వ్యక్తి లేచి కూర్చున్నాడు. చనిపోయాడంటూ నిమ్స్ వైద్యులు డెత్ సర్టిఫికేట్ ఇచ్చాక ఇంటికి తీసుకువెళుతుండగామార్గమధ్యంలో చనిపోయిన వ్యక్తి లేచి కూర్చున్నాడంటూ గురువారం మధ్యాహ్నం నుంచి సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లుకొట్టింది. దీంతో నిమ్స్ వర్గాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఎక్కడ లోపం జరిగిందో పరిశీలించాలని నిమ్స్ డైరక్టర్ బీరప్ప సిబ్బందికి వెంటనే ఆదేశాలు జారీ చేశారు.ఈ విషయమై నిమ్స్ వర్గాలు కూలంకషంగా పరిశీలించగా సోషల్ మీడియాలో, ఇతరప్లాట్‌ఫాంలలో వస్తున్న సిన్మా శీను అనే వ్యక్తి ఎవరూ అసలు నిమ్స్‌లోనే అడ్మిట్ కాలేదని రూఢీ చేసుకున్నారు. సోషల్ మీడియాలో ఎవరో కావాలనే ఇలాంటి తప్పుడు వార్తలు సృష్టించి నిమ్స్‌లాంటి ప్రతిష్టాత్మక సంస్థ క్రెడిబులిటీని దెబ్బతీయాలనిచూస్తున్నారని నిమ్స్ డైరక్టర్ బీరప్ప తెలిపారు. ఇలాంటి తప్పుడు వార్తలను సృష్టించే వారిపై లీగల్‌గా యాక్షన్ తీసుకోనున్నామని డైరక్టర్ బీరప్ప మీడియాకు ప్రకటన విడుదల చేశారు.

# కనిపిస్తే..కరుస్తున్నాయి..!

**-పేట్రేగిపోతున్న వీధి కుక్కలు -రోజా ఫీవర్ ఆస్పత్రికి 80-100మంది బాధితులు**



**హైదరాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త**
వీధికుక్కలు వీర విహారం సృష్టిస్తున్నాయి.కొన్ని చోట్ల క్రూర మృగాల్లా రెచ్చిపోతూ..పసిపిల్లల ప్రాణాలు తీస్తున్నాయి. ఒక్క ఫీవర్ ఆస్పత్రిలోనే రోజుకు సుమారు 100 మంది కుక్క కాటుతో చికిత్సకు వస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.నారాయణగూడలోని ఐపీఎంకు రోజూ 250 మంది వరకు కుక్కకాటు బాధితులే వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే వీధి కుక్క లు పలువురు చిన్నారులను చంపేశాయి. మొన్నటికి మొన్న వీధి కుక్కల దాడి లో ఓ పసిబాలుడు మృతి చెందగా, అంతకు ముందు అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడు కుక్కల దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. బాలానగర్ డివిజన్‌లోని రాజుకాలనీ, వినాయ కనగర్, సాయినగర్ ప్రాంతాల్లో పిచ్చి కుక్కల స్వైర విహారం చేస్తూ ఏకంగా 21మంది పిల్లలను కరిచాయి. జిహెచ్ ఎంసి, బోడుప్పల్, ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధుల్లో వీధి కుక్కలు పేట్రేగిపోతున్నాయి. బస్తీలు, కాలనీల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. అంతేకాకుండా..కొన్ని చోట్ల మనుషులపై ఎగబడి దాడికి పాల్పడుతున్నాయి .జంటనగరాల్లో కుక్క కాటు కేసులు విపరీతంగా పెరుడుతున్నాయి. కేవలం ఫీవర్ ఆస్పత్రిలో జూన్ నెలలో 2,607, జూలైలో 2,769 కేసులు నమోద య్యాయి. దాదాపుగా రోజుకి 80 నుంచి 100 కేసులు నమోదవుతున్నట్లు అధికారుల చెబుతు న్నారు. అంతేకాకుండా కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి సోకితే మరణం తప్పదు. రేబిస్‌కి చికిత్స లేదు. అయితే ఫీవర్ ఆస్పత్రిలో వారానికి రెండు రేబిస్ కేసులు నమోదు అవుతున్నాయి. వీధి కుక్కల వల్ల ఎక్కువగా కుక్కకాటుకు గురవుతున్నారు. జనాల్లో కుక్కకాటుకు వ్యాక్సిన్ ఉందనే అవగాహన లేకపోవడమే మరణాలు సంభవిస్తున్నాయని అంటున్నారు వైద్యులు. నగరంలో రేబిస్ వార్డు కేవలం ఫీవర్ ఆస్పత్రి లో ఉంది. ఇక్కడ ఎప్పటికీ రేబిస్ పేషంట్స్ అడ్మిషన్ జరుగుతూనే ఉన్నాయి. ఇది రేబిస్ వ్యాధికి దారితీస్తుంది. చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. వీధికుక్కల బెడదను నియంత్రించడంలో ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు అమలు చేయడంలో విఫలమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తుంటాయి.కుక్కల నియంత్రణకు జిమెచ్ఎంసి శ్వాత పరిష్కార చర్యలు చేపడుతోన్న దాఖలాలు లేవు. కుక్కల సంఖ్య తగ్గించేందుకు కీలకమైన బర్త్ కంట్రోల్ ఆపరేషన్లలో అదే ఆలసత్వం కనిపిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం గ్రేటర్‌లో 5.75లక్షల కుక్కలుండగా..కనీసం 50 శాతం స్టెరిలైజేషన్ కూడా జరగలేదు. యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ జరిగిన కుక్కల సంఖ్య ఇంచుమించుగా అంతే ఉంటుంది. కుక్కలకు సంబంధించిన నియంత్రణ ఒక్కటే మార్గం.కానీ ఆ నియంత్రణ సక్రమంగా లేకపోవడంతో ఈ సమస్య ఎదురవుతుంది. కుక్కల నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నామంటూ భారీగా లెక్కలు చెప్తూ నిధులను ఖర్చు చేస్తున్నారు. కానీ ఫలితం లేదు. ముఖ్యంగా వీటి ప్రత్యేకమైక లెక్కలంటూ లేకపోవడం, ప్రశ్నించే పరిస్థితి లేకపోవడంతో నిధులు భారీగా ఖర్చు అవుతున్నాయి. జిహెచ్ఎంసి పరిధిలో కుక్కలను పట్టుకోవడం, వాటికి శస్త్ర చికిత్సలు చేయడం కోసం పెద్ద యంత్రాంగం ఉంది. దీనికి కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయించడంతో పాటు కుక్కలను నియంత్రించేందుకు ప్రతి సర్కిల్‌లో వెటర్నరీ అధికారితో పాటు సిబ్బంది సైతం ఉన్నారు. ఫోన్ చేసిన తరువాత వచ్చి కుక్కలను పట్టుకుని వెళ్లేవారు, కానీ ఇప్పుడు ఎస్ఎంఎస్ పంపుతున్నారు. వాస్తవంగా మాత్రం ఒక్క కుక్కను పట్టుకున్న సంఘటన గానీ, నియంత్రణ చేసిన సంఘటనలు గానీ కనిపించడం లేదు.

అయితే ఈ వీధి కుక్కలను పట్టుకోవడం, వారికి ఆపరేషన్లు, మందులు, వారం రోజుల పాటు ఆహారం, ఇలా అన్నింటికి కలిపి భారీగానే నిధులను జిహెచ్ఎంసి వెచ్చిస్తుంది. వెటర్నరీ విభాగంలో అవినీతి పెరిగిపోవడంతో కుక్కల నిధులు నీళ్లలా ఖర్చు అవుతున్నాయి, మరోవైపు సామాన్య ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

## కాటేదాన్ చోరీ దొంగలు అరెస్ట్

**-రూ.16లక్షలు, ఇన్నోవా కారు, బైక్ స్వాధీనం**
**-వివరాలు వెల్లడించిన డిసిపి సిహెచ్ శ్రీనివాస్**





**హైదరాబాద్ ఆగస్టు 1, ప్రభాతవార్త:** కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో ఒక గొడౌన్‌లో జరిగిన రూ.50లక్షల చోరీ కేసును మైలర్‌దేవ్‌పల్లి పోలీసులు ఛేదించారు.గురువారం రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో డిసిపి సిహెచ్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు...మైలర్‌దేవపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాటేదాన్ ప్రాంతంలోని భారతీ ట్రేడర్స్ గొడౌన్‌లో గత నెల 20వ తేదీ అర్ధరాత్రి రూ.50లక్షలు దోపిడీ జరుగగా, భారతీ ట్రేడర్స్ యజమాని మహేందర్ కుమార్ ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన రాజేంద్రనగర్ పోలీసులు, శంషాబాద్ సీసీఎస్ బృందం, మైలర్‌దేవపల్లి పోలీసులతో కలిసి దోపిడీ దొంగలకై గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో 11 మంది నిందితులు దోపిడీలో భాగస్వామ్యం వహించినట్లు తేలగా, వారిలో నలుగురిని శాస్త్రిపురం ప్రాంతంలో పోలీసులు అరెస్ట్ చేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, పథకం రచించిన ప్రధాన నిందితుడు రషీద్‌తో పాటు మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.16లక్షల నగదు, 4సెల్‌ఫోన్లు, ఒక ఇన్నోవా కారు, బైక్, గడీయ పగలగొట్టే పరికరమైన సుత్తి, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నామని నిందితులు నలుగురూ రంగారెడ్డి జిల్లాకు చెందిన షేక్ మహమ్మద్ అఖీల్(25), షేక్ అద్నాన్(21), మహమ్మద్ సైఫ్(25), సయ్యద్ మోషిన్(28)గా గుర్తించారు. వీరిపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయినట్లు తెలిపారు. దోపిడీ చేసే క్రమంలో నిందితులు అద్దె కారుకు నకిలీ నెంబర్ ప్లేట్ పెట్టి వాడారని, దోపిడీకి పథకం రచించిన రషీద్ అనే నిందితుడు భారతీ ట్రేడర్స్ యజమాని మహేందర్ వ్యాపార వ్యవహారాలు, గొడౌన్‌లో నిరంతరం నిలవ ఉంచే భారీ నగదు వివరాలు ముందస్తుగా తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ప్రశాంత వాతావణంలో ఉత్సవాలు జరుపుకోవాలి
### -ఇన్స్పెక్టర్ అనుదీప్



పోలీసులను సన్మానిస్తున్న పీస్ కమిటీ సభ్యులు

**సికింద్రాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చిలకలగూడ ఇన్స్పెక్టర్ అనుదీప్ అన్నారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరుపుకున్న సందర్భంగా చిలకలగూడ పోలీసులను అభినందించడంలో భాగంగా ఇన్స్పెకర్టర్ అనుదీప్, ఎస్సైలు బాలరాజు, సమితలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ ప్రజల సహకారం లేకపోతే నేరాల నివారణలో పోలీసులు విజయవంతం కాలేరని అన్నారు. పోలీసుకు యూనిఫాం ఉంటే ప్రజలు యూనిఫాం లేని పోలీసులుగా వ్యవహరించాలని, అప్పుడే ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోగలుగుతారని అన్నారు. ఉత్సవాల సందర్భంగా పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించారని, వారికి దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్ప శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, డైమండ్ శ్రీను, మల్లేష్ యాదవ్, సతీష్, గౌస్, చిన్న, రాము, శ్రీను, నారాయణ తదితరులు పల్గొన్నారు.

## సమాజ సేవలో రోటరీ క్లబ్

**తార్నాక, ఆగస్టు 1 ప్రభాతవార్త:** సమాజ హితం కోసం రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ పలు సామాజిక కార్యక్రమాలను చేస్తున్నామని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్ అధ్యక్షురాలు అనిత పాటి బండి ఆద్వర్యంలో నాచారం ఈఎస్ఐ హాస్పిటల్లో రూ. రెండు లక్షల 8వేల వ్యయంతో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్‌కు సంభందించిన ఆధునిక యంత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గవర్నర్ శరత్ చౌదరి, ఇఎస్ఐ హాస్పిటల్ సూపరెండెంట్ డా. కమలతో కలిసి యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ యంత్రం ద్వారం బ్లడ్‌ను ఎవరైన దానం చేస్తే దానిని మూడు రకాలుగా వినియోగించుకోవచ్చున్నారు. హాస్పిటల్‌కు ఇలాంటి యంత్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు వీణ, స్వేత, డా. చీమ శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి కెవి. మూర్తి, డైరెక్టర్ టివి. రెడ్డి, అధ్యక్షులు స్టెఫెన్ యుర్‌చిక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కులవివక్షను అరికట్టడానికి మున్షీప్రేమ్‌చంద్ కృషి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్, డాక్టర్‌హెచ్‌కె. వందన

**చిక్కడపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** హిందీలో కథలు, నవలలు, సంపాదకీయాలురాసిన మహనీయుడు మున్షీప్రేమ్‌చంద్ అని వక్తలు అన్నారు. గురువారం రీసర్చ్ ఫౌండేషన్ ఫర్ డివోషనల్ లిటరరీ, కల్చరర్ స్టడీస్(ఉస్మానియా విశ్వవిద్యాలయం), బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, నవలాకారుడు మున్షీప్రేమ్‌చంద్ జయంతి ఉత్సవాలు, సెమినార్ కార్యక్రమం కన్వీనర్, ప్రభుత్వ సిటీ కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ హెచ్‌కె. వందన ఆధ్వర్యంలో జరిగింది. బాగ్‌లింగంపల్లిలోని కళాశాల ఆవరణలో ఓయు రీసర్చ్ ఫౌండేషన్ ఫర్ డివోషనల్ లిటరరీ, కల్చరర్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సమాజ సేవను, కులవివక్షతను అరికట్టడానికి, సాంఘిక దురాచారాలను రూపొందించుకునేందుకు ఆయన రాసిన కథలు, కవితల ద్వారా సామాన్య ప్రజల జీవిత ఇతివృత్తాలుగా నిలిచాయని, ఆయన రాసిన కథలు చదివిన వ్యక్తులను ఆలోచింపచేస్తాయని, మనిషిగా ఎలా ఉండాలో ఆలోచింపచేస్తాయన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ కళాశాల డైరెక్టర్(అకాడమిక్స్) డాక్టర్ ఎన్. రిషికాంత్, ప్రిన్సిపాల్ డాక్టర్‌మట్ట శేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రియదర్శిని తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సెమినార్ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు.

## మందకృష్ణ మాదిగకు శుభాకాంక్షలు తెలిపిన గౌరీష్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు1 ప్రభాతవార్త :** దశాబ్దాలకాలంగా వర్గీకరణలేక అల్లాడుతున్న జాతికి సుప్రీంకోర్టు తీర్పుతో యావత్ దేశానికి అన్నిరంగాలలో మేలు జరుగుతుందని కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్, బిజెపి నాయకులు కె.ఎం. గౌరీష్ ఆనందోత్సాహన్ని వ్యక్తంచేశారు. కోర్టుతీర్పుదృష్టా ఆయన ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మందకృష్ణమాదిగకు అభినందనలు తెలిపారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు మద్దతుగా తీర్పుఇవ్వడంవల్ల స్వాతంత్రం నుండి పోరాటం చేస్తున్న మాదికగలకు ఎంతో మేలు చేకూర్చినట్లవుతుందని అన్నారు. చారిత్మాకంగా తీర్పుచెప్పి దళితవర్గాలకు ఎంతోమేలు చేసిన సుప్రీంకోర్టుతీర్పుద్వారా అణగారిన దళజతవర్గాలకు రానున్నరోజుల్లో విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడటంతో పాటు జాతిపునర్నిర్మాణంలో భాగస్వాతం దక్కినట్లవుతందన్నారు. భారత ప్రధాని నరేంద్రమోడి నాయకత్వంలో అన్నివర్గాలకు పూర్తిన్యాయం జరుగుతుందన్నారు. గత 30ఏళ్ల మందకృష్ణ మాదిక పోరాటానికి న్యాయం జరిగిందన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో సుప్రీంకోర్టు దళితల రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పుఇవ్వడం సంచలని కె.ఎం. గౌరీష్ అన్నారు.

## ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం తీర్పుకు సర్వత్రా హర్షం



**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై గురువారం సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇవ్వడం పట్ల తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. గురువారం చిక్కడపల్లిలోని రాష్ట్ర గౌడ సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో కమిటీ చైర్మన్ బాలరాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ కుమార్ గౌడ్‌లు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యారంగాల్లో రిజర్వేషన్ ఫలాలు అందని కులాలకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ కులాలను ఏబీసీడీలుగా వర్గీకరించి విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ మాదిగలు మూడు దశాబ్ధాల పాటు వివిధ రకాలుగా పోరాడి విజయం సాధించారన్నారు. ఈ స్పూర్తితో బీసీలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లకై పోరాడేందుకు పిలుపునిస్తామన్నారు. ఉద్యమాలకు దిక్సూచి చూపించిన మాదిగ దండోరా ఉద్యమం తమకు ఆదర్శమన్నారు. తమ హక్కుల కోసం వారు చేసిన పోరాటంలో, ఎవరు ఎంత ఉంటే వారికి అంత వాటా అనే సామాజిక న్యాయ సూత్రంతో ముందుకెళ్ళి అన్ని కులాలకూ ఎస్సీ ఎస్టీలు మార్గదర్శకం చూపించారన్నారు.

## పటేల్‌నగర్ బస్సు సమయం మార్పుతో ప్రయాణీకుల అవస్థలు

**హైదరాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఆర్టీసీ బస్సులు ఏ సమయానికి వస్తాయో తెలియక ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. రోజుకు ఒక్కో సమయానికి బస్సులు వస్తుండడతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈరోజు ఒక సమయానికి వస్తే, మరునాడు మరో సమయానికి వస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రయాణికులు అవస్థలు పడే పరిస్థితి నెలకొంటోంది. ప్రతీరోజు నిర్ధిత సమయానికి ప్రయాణించే ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు బస్సులు రోజుకో సమయానికి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తా నుంచి బయలుదేరే ఆర్టీసీ బస్సులు ప్రయాణికులను తిప్పలు పెడతున్నాయి. ఉప్పల్ డిపోకు చెందిన 113 ఎం, జెడ్ ఆర్టీసీ బస్సు పటేల్‌నగర్ చౌరస్తా నుంచి గతంలో ప్రతిరోజు ఉదయం 8గంటల 15 నిమిషాలకు బయలుదేరి మెహదీపట్నం వెళ్ళేది. ఈ సమయంలో వివిధ కళాశాలలకు చెందిన వెళ్ళే విద్యార్థులకు పూర్తిగా అనుకూలంగా ఉండేది. అయితే గత జూలై 14న ఈ ఆర్టీసీ బస్సు టైమింగ్ మార్చారు. ఉదయం 8గంటలకే ఈ బస్సు వెళ్ళిపోతోంది. దీంతో ఉద్యోగులు, కళాశాలల విద్యార్థులు ఇబ్బందికరంగా మారింది. కొందరు విద్యార్థులు, ఉద్యోగులు అధికారులను సమయం మార్చాలని కోరినప్పటికి ఫలితం లేకపోవడంతో స్థానికంగా ఉండే బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఆనంద్‌గౌడ్ ఆర్టీసీ అధికారులతో చర్చించడంతో అధికారులు పాత టైమ్ ప్రకారమే బస్సులు తిరిగేలా చర్యలు తీసుకున్నారు. అయితే మళ్ళి అప్పుడప్పుడు సమయపాలన లేకుండా ఇష్టానుసారంగా వెళుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఉదయం కూడా 8గంటలకే వెళ్లిపోయింది. దీంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

తప్పనిసరి పరిస్థితిలో ఆటోలు, క్యాబ్‌లను పెద్దమొత్తంలో చెల్లించి గమ్యస్థానాలకు వెళ్ళాల్సివచ్చింది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు 113ఎం, జెడ్ బస్సును ఉదయం 8గంటల 15 నిమిషాలకే నడపాలని కోరుతున్నారు.

## పేద ప్రజలకు సిఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగం : ఎమ్మెల్యే



లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ఆశయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ కింద అడిక్‌మెట్, కవాడీగూడ డివిజన్‌లకు చెందిన పద్నాలుగు మంది లబ్దిదారులకు రూ.4.91లక్షలు, ఎనిమిది మంది లబ్దిదారులకు రూ.6.70లక్షలు, చెక్కులను అర్హులైన లబ్దిదారులకు అందించిన అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే వేలాది కుటుంబాలను సిఎం సహాయ నిధి ద్వారా ఆదుకున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా సిఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తులు చేసుకున్నవారందరికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిక్‌మెట్, కవాడీగూడ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, కడప శ్రీనివాస్‌రెడ్డి, సాయికృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసి కళాభవన్ వద్ద సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్దం

**చిక్కడపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్ర శాసనసభలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిపై సిఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసన వ్యక్తంచేస్తూ బిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి ఆర్టీసి కళాభవన్ వద్ద సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నిండు శాసనసభలో ఎమ్మెల్యేను అవమానించిన సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్. రూప్‌సింగ్, నిర్మల రెడ్డి, చెన్నయ్య, బి. మారుతి రావు, ఆటో యూనియన్ నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

## సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలి

**సైఫాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** మహిళలకు ఉచితం ప్రయాణ సౌకర్యం బదులు సంపూర్ణ మద్యపాన నిషేదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని షేక్ హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జెఏసి కన్వీనర్ షేక్ అమానుల్లాఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందుకోసం అక్టోబరు 2వ తేదీన గాంధీ జయంతినాడు తాను ఆమరణ నిరాహారదీక్ష చేపడుతున్నానని చెప్పారు. గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమానుల్లాఖాన్ మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ బస్‌లలో ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లకు గిరాకీలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ఆనేక మంది ఆటో డ్రైవర్లు చనిపోవడం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మహిళలు ఏనాడు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కోరలేదని, వారి శాశ్వత డిమాండ్ సంపూర్ణ మద్యపాన నిషేదమన్నారు. నిషేదం అమలు చేస్తే రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉంటాయని, మహిళలపై నేరాలు, ఘోరాలు జరగవని, అలాగే రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయన్నారు. ఈ సమావేశంలో జెఏసి నాయకులు మొహ్మద్‌అజీముద్దీన్, ఫారుక్‌బాయి, అతీఫ్‌బాయి, ఆలీబాకరీ పాల్గొన్నారు.

## వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం

**హైదరాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కెపి మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాలకు వర్గీకరణకు వాయిదా తీర్మానం చేస్తే గత ప్రభుత్వం సంపత్‌కుమార్‌ను సస్పెండ్ చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ సుప్రీంకోర్టుకు అడ్వకేట్ జనరల్‌ను పంపడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్రంలో వర్గీకరణ చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆయన అశాభావం వ్యక్తం చేశారు.

## ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో బిఆర్ఎస్ నేతల ఆందోళన

**చిక్కడపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై సిఎం చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసే కార్యక్రమం బిఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠాజయసింహ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. సిఎం డౌన్‌డౌన్, మహిళలకు క్షమాపణలు చెప్పాలని పెద్దపెట్టున నినాదాలు చేయడం, దిష్టిబొమ్మ దగ్ధం చేయడానికి యత్నించిన సమయంలో ముఠాజయసింహతో పాటు నేతలను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సిఎం చేసిన వ్యాఖ్యలు మొత్తం తెలంగాణలోని ఆడబిడ్డలను కించపరిచే విధంగా ఉన్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్, కవాడీగూడ, బోలక్‌పూర్, ముషీరాబాద్, అడిక్‌మెట్ డివిజన్‌ల అధ్యక్షులు రాకేశ్‌కుమార్, వల్లాల శ్యామ్‌యాదవ్, వై. శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ నేతలు ముఠానరేశ్, పాశం రవి తదితరులు పాల్గొన్నారు.

## కుళ్లిపోయిన మృతదేహం లభ్యం..

**మూసాపేట, ఆగస్టు 1, ప్రభాతవార్త**

కుళ్లిపోయిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట మైసమ్మ చెరువు సమీపంలోని చెట్ల పొదల్లో సుమారు 30-35 సంవత్సరాల వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. అటువైపు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో మృతుడు 25 రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం చేతిపై బి అనే ఇంగ్లీషు అక్షరం టాటూ ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టు నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

## త్వరలోనే రాష్ట్ర వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీలను చేపడతాం
### -మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంత్రి తుమ్మలనాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వైద్యనాథ్

**చిక్కడపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయ శాఖ పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలను సాధ్యమైనంత తొందర్లోనే జరిగేలా చర్యలు తీసుకుంటానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. సచివాలయంలో ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వైద్యనాథ్, కృపాకర్‌రెడ్డిల నేతృత్వంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. చాలాకాలంగా ఎదురుచూస్తున్నటువంటి వ్యవసాయ శాఖలో బదిలీలు చేపట్టకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రికి వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా పంటల నమోదు వంటి రైతు అభ్యున్నతి కోసం చేపడుతున్న పథకాలను వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సక్రమంగా చేస్తున్నారన్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం నాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు సంఘాలతో చర్చలు
### -రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్



మంత్రి పొన్నంప్రభాకర్‌కు వినతిపత్రంసమర్పిస్తున్న భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆల్లూరి రవిశంకర్

**చిక్కడపల్లి, ఆగస్టు 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం అధ్యయన కమిటీని ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆల్లూరి రవిశంకర్ నేతృత్వంలో ఆటో, రవాణా సంఘం ప్రతినిధులు లిఖిత్‌కుమార్, ఎం.డి. హబీబ్, శ్రీనివాస్ ముదిరాజ్, సంతోష్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమబోర్డు విషయం, ఓలా, ఊబర్ బైకుల ద్వారా ఆటోడ్రైవర్లను రక్షించాలని, ఆటోమీటర్ రేట్లు పెంచాలని, గూడ్స్ వాహనాల ఉపాధి దెబ్బతీసే పోర్టర్‌ను నిషేదించాలనిమంత్రిని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఏటా ఇసానతమని ఇచ్చిన హామీమేరకు రూ.12వేలు వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ సమావేశాల తర్వాత ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు సంఘాలతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చారు.

## చదువు ఒక్కటే మనిషి ఎదుగుదలకు తోడ్పాటు
### -డాక్టర్ సుదర్శన్ రాపోలు



**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** చదువు ఒక్కటే మనిషి ఉన్నత శిఖరాలకు ఎదగడానికి తోడ్పడుతుందని, తాము ఎన్నుకున్న రంగంలో మంచి స్థాయిలో ఉండేందుకు చదువు ముఖ్య భూమిక పోషిస్తుందని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రాపోలు సుదర్శన్ అన్నారు. గురువారం జరిగిన సుల్తాన్ బజార్ క్లాక్ టవర్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన 10వ తరగతి విద్యార్థులను ప్రశంసించే సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌కై పలు సూచనలిచ్చారు. విద్యని అభ్యసించడం వల్ల వచ్చే ప్రాముఖ్యత గురించి, నచ్చిన రంగంలో రాణించేందుకు తగిన మార్గాల గురించీ వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన డాక్టర్ రహీమ్ మాట్లాడుతూ, విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకుని ఇష్టపడి చదివితే తామనుకున్నది సాధిస్తారన్నారు. అనంతరం గత సంవత్సరం 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం నగదు బహుమతులను బహుకరించారు. అంతే కాకుండా పాఠశాల ప్రస్తుత విద్యార్థులకు బెల్టులు, టై, బ్యాడ్జిలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులైన సైంటిస్ట్ ఎం. అశోక్ కుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ద్వారకానాథ్, ఎం. సేతుపతి, సలీమ్, ఆదిత్యా, మల్లారెడ్డి, సుబ్రహ్మణ్యం, కే.సుబ్బారావు, మోహన్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# ఎస్సీవర్గీకరణ అగ్రకుల రాజకీయపార్టీల కుట్ర

### 6త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
### -మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు మన్నె శ్రీధర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రావు, రమేష్‌బాబు, ఆనందరావు తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఎస్సీవర్గీకరణ అగ్రకుల రాజకీయ పార్టీల కుట్ర అని త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు మన్నె శ్రీధర్‌రావు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గోపోజు రమేష్ బాబు అన్నారు. ఈమేరకు గురువారం వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పునేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుతం విభజించు పాలించు రాజకీయాలు నడస్తున్నాయని ఎస్సీలను విభజించి రాజీయ లబ్దిపొందాలని చూస్తున్నారని ఇలా చేసే పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అలాగే ఎస్సీవర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చునని తీర్పునిచ్చిన విషయంలో త్వరలోనే మాలమహానాడు మాల ప్రజా సంఘాలు జేఏసీ సుప్రీంకోర్టును ఆశ్రయించి క్యూరేటర్ పిటిషన్ దాఖలు చేసి న్యాయబద్ధంగా పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీవర్గీకరణ అవసరం లేదని ఎస్సీల్లోని అన్ని కులాలు అన్నిరంగాల్లో విద్యా, ఉద్యోగం రాజకీయరంగాల్లో సమానంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలోని అంటరాని కులాలన్ని ఐక్యంగా ఉండాలన్నారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య నాయత్వంలో త్వరలోనే దేశంలోని అన్ని దళిత సంఘాలు రాజకీయ పార్టీలను కలుపుకుని రాష్ట్రాల మద్దతు కూడగట్టి దేశవ్యాప్తంగా ఉద్యమించి ఐక్యంగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు తాలూక రాజేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగి ఆనందరావు, సిటీవైస్ ప్రెసిడెంట్ గోకుల్ కళ్యాణ్, సిటీ జనరల్ సెక్రటీర మర్రిపల్లి శ్రీకాంత్, ఎల్లస్వామి, ఆదర్శ్ మారేడు , ప్రసాద్, చేతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు తక్షణమే చేపట్టాలి



మోడల్‌స్కూల్ ఉపాధ్యాయుల దీక్షకు మద్దతు తెలుపుతున్న తెలంగాణ లెక్చరర్స్ ఫోరం నాయకులు

### తెలంగాణ లెక్చరర్స్ ఫోరం కన్వీనర్ కత్తి వెంకటస్వామి

**ధర్నాచౌక్, ఆగస్ట్ 1, ప్రభాతవార్త:** మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులను తక్షణమే వారి సొంత జిల్లాలకు బదిలీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం కన్వీనర్ కత్తి వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు సంఘాలకు అతీతంగా మాగోడు వినండి ముఖ్యమంత్రిగారూ అంటూ శాంతి యుతంగా దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతు తెలిపిన కత్తి వెంకట స్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత పదకొండు సంవత్సరాలుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని అన్నారు. కుటుంబాలకు దూరంగా ఉన్న ఉపాధ్యాయులు మానసిక వత్తిడికి లోనవుతూ ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయలు అరవింద్‌ఘోష్, ఇర్షాద్‌అలీ, సాయి చరణ్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న దాదాపు 194 ఆదర్శపాఠశాలలో మూడు వేల మంది ఉపాధ్యాయులు తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ అనేక ఆరోగ్య సమస్యలు, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రికి మూడు వేల మంది ఉపాధ్యాయుల ఆవేదనను తెలియచేయాలనే ఉద్దేశ్యంతో ఈ దీక్ష చేపట్టామని, ముఖ్యమంత్రి మా సమస్యలు అర్థం చేసుకుని సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో రవీందర్, షాజిద్, ఆంజనేయులు, దేవీప్రసాద్, గోపీనాథ్, రాజశ్రీ, పద్మ, రజని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలతో తల్లి పిల్లల ఆరోగ్య సంరక్షణ

### - డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి సూచన



ప్రపంచ తల్లిపాల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

**సైఫాబాద్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** శిశువుకు ఆరు నెలలపాటు తల్లిపాలు తప్పనిసరి అవసరమని, ఏడాది పాటు తల్లిపాలు క్రమం తప్పకుండా ఇస్తే మరీ మంచిదని సుల్తాన్ బజార్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం ఆరోగ్య కేంద్రంలో పిల్లల తల్లలకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిపాలలో యాంటి బాడీస్ పుష్కలంగా లభిస్తాయని, ఇవి వైరస్‌పైన, బాక్టీరియాపై పోరాటం చేస్తాయని, మొట్ట మొదట వచ్చే తల్లిపాలలో కోలస్ట్రాల్ ఉంటుందని, ఇందులో ఇమ్యునోగ్లోబులిన్ ఎ (ఐజీఎ) సమృద్ధిగా ఉంటుందని, అలాగే ఇందులో ఇతర యాంటీ బాడీస్ కూడా ఉంటాయని, వైరస్ లేదా బాక్టీరియాకు తల్లి ఎక్స్‌పోజైతే ఆమె శరీరంలో యాంటీబాడీస్ ప్రొడ్యూసవుతాయన్నారు. ఈ యాంటీ బాడీస్ తల్లిపాలలో విడుదలై శిశువుకు చేరుతాయని బేబీ ముక్కు, గొంతు అలాగే డైజెస్టివ్ సిస్టమ్‌లో రక్షణ కవచం ఫార్మ్ అవుతుందని, సాధ్యమైనంతవరకు తల్లి స్ట్రిక్ట్ హైజీన్‌ను పాటిం చాలని డాక్టర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. తల్లిపాలకు నోచుకొని శిశువుల్లో నుమోనియా, డయేరియాతోపాటు ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం ఉంద ని ఆయన హెచ్చరించారు. తల్లిపాలు శిశువులకు ఇవ్వడం వల్ల తల్లి పిల్లలు క్షేమంగా ఉంటారని, తల్లిపాలు పిల్లలకు శ్రీరామరక్ష లాంటి దని, తల్లులు తమ పిల్లలకు పాలు ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జరగనున్నాయని ఆయన తెలిపారు

# సెప్టెంబర్ 9న "ఆదివాసీ గిరిజన సింహ గర్జన "

### గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ భూక్యా సంజీవ్‌నాయక్



అభివాదం చేస్తున్న సీతారాం నాయక్, సత్యవతిరాథోడ్, సంజీవ్‌నాయక్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం గిరిజన రిజర్వేషన్లు 12శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగిగే "ఆదివాసీ గిరిజన సింహ గర్జన " విజయవంతం చేయాలని గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ భూక్యా సంజీవ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపి సీతారాంలతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జివో 33ద్వారా వచ్చిన పదిశాతాన్ని కాపాడుకుని ,కుట్రదారులను బొందపెట్టాలంటే గిరిజన ఐక్యతను చాటాలన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన అధివాసీలతో సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈసభకు సిఎంరేవంత్‌రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులను ఆహ్వానిస్తామని ఆసభకు రానివారిని గిరిజనుల వ్యతిరేకిగా ప్రకటిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో అడ్వకేట్ జోగురాం నాయక్, మొగిలి మల్లయ్య, మాలోత్ సైదా నాయక్, నిర్వాహకులు రవిరాథోడ్, నర్సింహ్మా, మిత్ర, సుధీర్, సురేస్, విజయ్, అర్చన, రేఖ, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అభినయ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు

**రవీంద్రభారతి, ఆగస్టు 1 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ, అభినయ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ, కర్ణాటక ప్రభుత్వ కన్నడ సాంస్కృతికశాఖ సహకారంతో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో నేటి నుండి శనివారం వరకు మూడు రోజులపాటు జరుగనున్న 18వ అభినయ జాతీయ బహుభాషా నాటకోత్సవాలు-అభినయ నేషనల్ థియేటర్ ఫెస్టివల్ 2024 గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. అభినయ 70వ నాటకోత్సవంలో భాగం జరుగుతున్న ఈ జాతీయ బహుభాషా నాటకోత్సవాల్లో మొదటిరోజు నాటక ప్రదర్శనల్లో ముందుగా ఒక స్త్రీ పురుషుడి మధ్య కారణాంతరాల వల్ల కలకాలం కలిసి ఉండేలా శాసించే వివాహబంధ వ్యవస్థను కాపాడుకోవడం కథాంశంగా మాడభూషి దివాకరబాబు రచన; సురభి నాగరాజు సంగీతం; మంజునాథ దర్శకత్వంలో అభినయ థియేటర్ ట్రస్ట్ హైదరాబాద్ వారి సమర్పణలో రూపొందిన తెలుగు నాటిక మాట్లాడుకుందాం; అనంతరం సంఘజీవి అయిన మానవుడు విభిన్న సామాజిక స్థానాల ఆధారంగా సమాజంలోని పరిస్థితుల కారణంగా వివిధరకాల మనస్తత్వాలు, సామాజిక పరిస్థితులను అన్వేషించే కథాంశంగా తేజస్ బిల్డికర్ సంగీతం, సంకేత్ సీమ విశ్వాస్ రచన దర్శకత్వంలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్, నాసిక్ మహారాష్ట్ర వారి సమర్పణలో రూపొందిన మరాఠీ నాటకం ప్రథమ్ పురుష్ నటీనటులచే అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతుల ప్రశంసలు అందుకున్నాయి. ఈనాటి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ కళారంగంలోని నాటిక నాటకాలు ఎంతో ప్రత్యేకతను సంతరించుకొన్నాయని, నటీనటుల సాంకేతిక ప్రతిభ అనిర్వచనీయమని, ఈ కళను ఎంతో మక్కువతో పోషిస్తున్న అభినయ శ్రీనివాస్ అభినందనీయులని, రంగస్థల కలకాలం విరసిల్లాలని ఆకాంక్షిస్తూ అందరికీ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా డా. డి. విజయభాస్కర్, దైవజ్ఞశర్మ, డా. కె.జె. రెడ్డి, నరసింహారావు, అమలేశ్వరీ, అభినయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం 2వరోజు రాత్రి 6.30గంటల నుండి మణిపురి నాటకం లైహల్లి; మరాఠీ నాటకం ఆగా ఆగా సున్‌బాయి కే మ్హంతా సాసుబాయ్‌లు ప్రదర్శింపబడతాయని నిర్వాహకుడు అభినయ శ్రీనివాస్ తెలిపారు.

# నూనెగింజల పరిశోధన సంస్థ వ్యవస్థాపక దినోత్సవం



**అత్తాపూర్ ఆగస్టు 1, ప్రభాతవార్త :** భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ హైదరాబాద్ 48వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఐసిఎఆర్-ఎన్ఐబిఎస్ఎం నిర్దేషకులు డా.పి.కె ఘోష్ ,ప్రధాన శాస్త్రవేత్త డా.ఎస్ ఎన్ నిగమ్, ఐసిఎఆర్-110ఆర్ నిర్ధేషకులు ఐసిఆర్ఐఎస్ఎటి గౌరవ అతిథిగా డా.ఆర్.కె మథుర్, శాస్త్రవేత్తలు, సిబ్బంది హాజరైయ్యారు. ఈ సందర్భంగా డా.ఘోష్ నూనెగింజల పంటలపై జీవసంబంధిత ఒత్తిడిలు, వాటి యాజమాన్యంలో వినూత్న విధానాలపై ఉపాన్యసించారు. అనంతరం డా.నిగమ్ మాట్లాడుతూ...మారుతున్న వాతావరణం దృష్టిలో ఉంచుకొని వనరులను హెతుబద్ధంగా వాడుకో వాలని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ పరిశీలన పేపర్ ఉత్తమ ఉద్యోగి అవార్డులను బహుకరించారు. శాస్త్రజ్ఞులు రాసిన 5 సాంకేతిక ప్రచురణలను విడుదల చేశారు. ఐసిఎఆర్-110ఆర్ నుండి రైతులకు ఆముదం, కుసుమ, నువ్వుల విత్తనాలను అందజేయడం జరిగింది. ఐసిఎఆర్-110 ఆర్, రెండు సంస్థలతో వివిధ రంగాలలో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ వేడుకలలో తెలంగాణ ,తమిళనాడు రాష్ట్ర నుండి రైతులు పాల్గొన్నారు.

## హత్తిగూడ చెరువు ఆక్రమణకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి : కొప్పుల



చెరువు ఆక్రమణపై విజిలెన్స్ అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ కొప్పుల

**హయత్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ప్రాంతంలో కబ్జాకు గురవుతున్న హత్తిగూడ చెరువును కాపాడాలని కోరుతూ జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవిడిఎం) కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌కు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. గురువారం ఈవీడీఎం ఏఈ మల్లిఖార్జున్, ఎస్ఐ మోహన్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులతో కలిసి కార్పొరేటర్ చెరువును, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హత్తిగూడ చెరువు ఆక్రమణకు గురవుతోందని పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు 6 ఎకరాల చెరువును పూడ్చి 2 ఎకరాలుగా చూపే మ్యాపును సృష్టించారని ఆరోపించారు. మట్టితో చెరువును పూడుస్తున్నారని ఫిర్యాదులు చేసినా పట్టిపట్టనట్లుగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈక్రమంలో కార్పొరేటర్ చెరువుకు సంబంధించిన హద్దులను, ధ్వంసం చేసిన తూము, అలుగును, చెరువులోకి వరదనీరు వచ్చే కాలువలను పూడ్చివేసిన స్థలాలను విజిలెన్స్ అధికారులకు చూపించారు. చెరువు ఆక్రమణలను తొలగించి పైనున్న కాలనీలనుంచి వచ్చే వరద నీటిని చెరువులోకి మళ్లిస్తే సుమారు 20 కాలనీల ముంపు సమస్యను పరిష్కరించినట్లు అవుతుందన్నారు. చెరువుకబ్జాకు సహకరించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ విజిలెన్స్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్ఐలు నర్సింహ, బిక్షపతి, సర్వేయర్ జ్యోతి, ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, ఏఈ తస్వీన్ రజాక్, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సబితారెడ్డికి సిఎం క్షమాపణలు చెప్పాలి



బడంగ్‌పేట్‌లో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** మహిళా ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి, సునీతారెడ్డిలను అవమానించిన సిఎం రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని బడంగ్‌పేట్‌కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి డిమాండ్ చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ 5 పర్యాయాలు ఎమ్మెల్యేగా, 3 పర్యాయాలు మంత్రిగా పనిచేసిన సబితారెడ్డిని కించపరుస్తూ సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కలు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. జరుగుతున్న పరిణామాలను తెలంగాణ ప్రజానీకం గమనిస్తున్నదనీ వారే గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, బోయపల్లి శేఖర్‌రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, పుట్టగళ్ళ సంతోష్, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, దండు గణేష్ ముదిరాజ్, ఇఎల్‌వి అశోక్, జుకంటి సురేష్‌గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి : పోల్కం శ్రీనివాస్



మంత్రి ప్రభాకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న పోల్కం శ్రీనివాస్

**మలక్‌పేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** జలమండలి కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయలేదని ఆరోపించారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని నూతన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫెడ్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ

**మలక్‌పేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసెబుల్డ్ సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్ సంబంధిత ఆఫీస్ ఆటో మిషన్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్ యోగాలలో 6 నెలల శిక్షణ కోర్సులను నిర్వహించనున్నట్లు ఫెడ్ జనరల్ సెక్రటరీ చెరుకు నాగభూషణం పేర్కొన్నారు. ఈ కోర్సులలో శిక్షణ పొందడానికి 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు ఆగస్టు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 9494019888, 9381706624లలో సంప్రదించాలని కోరారు. కోర్సులు పూర్తి చేసిన వారికి తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి ధృవపత్రాలు అందించడం జరుగుతందని వివరించారు.

## ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు : బట్టు దాస్‌రావు



హర్షం వ్యక్తం చేస్తున్న బట్టుదాసురావు తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి బట్టు దాస్‌రావు మాదిగ హర్షం వ్యక్తం చేసారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇవ్వడంతో మూసారాంబాగ్‌లో నాయకులు, కార్యకర్తలతో కలిసి సంబురాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా సుదీర్ఘ సమస్యకు నేడు పరిష్కారం లభించిందన్నారు. అదేవిధంగా ఓల్డ్ మలక్‌పేటలో మలక్‌పేట దళిత సేవా సంఘం అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌకి రవికుమార్, ఎల్ఆర్ సత్యనారాయణ, రాజ్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, ముప్పిడి శ్రీనివాస్, విష్ణుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారాలను మానుకోవాలి : మేయర్ పారిజాత



కెటిఆర్, సబితారెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలను నిరసిస్తూ గురువారం బడంగ్‌పేట్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా హాజరైన మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డిపై సబితా ఇంద్రారెడ్డి చేసిన అబద్ధపు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో పదవులు పొంది పార్టీని వీడిన బిఆర్ఎస్‌లో చేరి కాంగ్రెస్‌పై చేస్తున్న బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నేనావత్ బాలు నాయక్, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర జైహింద్‌కుమార్, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బాల్‌సింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, సుభాన్ యాదవ్, కొవ్వూరి రాకేష్, సూర్ణగంటి విజయ్, ఎరుకల రవిగౌడ్, మహిళా నాయకురాళ్లు గొరిగె అయిలమ్మ, తూళ్ళ సునీతాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ఎమ్మెల్యేలపై సిఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బిఆర్ఎస్ ధర్నా



సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్పొరేటర్లు గీత, జ్యోష్న

**ఉప్పల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ మహిళ ఎమ్మెల్యేలపై సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్, రామంతాపూర్‌లో దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా ఉప్పల్‌లో సర్వే జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, జె. ప్రభుదాస్, రామంతాపూర్ ప్రధాన రహదారిలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న నాగేశ్వర్‌రావుల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మలను దహనం చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీలో బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సిఎం, డిప్యూటి సిఎంలకు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. అబద్దాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. మహిళలను అగౌరవపరిచిన సిఎం.డిప్యూటి సిఎంలు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు మధుసూధన్‌రెచడ్డి, సంపత్‌రావు, శంకర్, నర్సింగ్‌రావు, తూట్ నరసింహ, శ్రీకాంత్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, ఆలే రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, సంధ్య, జానకి, లక్ష్మి, మంజుల, స్వప్న పాల్గొన్నారు.

## మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి ఎమ్మార్పిఎస్ నాయకుల పాలాభిషేకం

**నేరెడ్‌మెట్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** 30యేళ్ళ పోరాట ఫలితం, నిబద్ధతగా నడిపిన అధినేత మంద క్రిష్ణ మాదిగకు అంతరు రుణపడి ఉండాలని కేశపాక రామచంద్ర మాదిగ తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టులో తుది తీర్పు వెలవడిన సందర్భంగా నేరెడ్‌మెట్‌లోని మాదిగ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, మంద క్రిష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో యేళ్ళుగా పోరాటం చేస్తూ అమరవీరుల బలిదానం, కార్యకర్తల పాత్ర లక్ష్యం నేటికి సాకారం అయ్యిందన్నారు. జాతి తరపున వర్గీకరణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బచ్చలకూర స్వామి, సీనియర్ నాయకులు శేఖర్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, రాజు, గణేష్ క్రిష్ణ, నర్సింహ్మ, విహెచ్‌పిఎస్ అధ్యక్షులు వినయ్, శేఖర్, రమేష్, సురేష్, బండారి సాయి, రవి, ప్రేమ్, నవీన్, కనకరాజు, గిరిబాబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ ఆలయానికి మహేందర్‌రెడ్డి రూ. 3లక్షల విరాళం



చామకూర మహేందర్‌రెడ్డిని సత్కరించిన శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులు

**జవహర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పోచమ్మ ఆలయానికి సొంత నిధులు రూ. 3లక్షలను అందించడం సంతోషకరమని శ్రీరామ్‌నగర్‌కాలనీవాసులు తెలిపారు. గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలసి ఆలయ నిర్మాణానికి సహాయం అందిచాలని కోరిన వెంటనే రూ. 3లక్షలు ఇవ్వడం ఆయన మంచి మనస్సుకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ గతంలో జవహర్‌నగర్ పరిధిలోని ఎన్నో ఆలయాలకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షులు సాంబయ్య గౌడ్, కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, అడ్వైజర్ శ్రీనివాస్, సంపత్, శైలేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 4న శ్రీ ఎల్లమ్మదేవి బోనాల ఉత్సవాలు

**వనస్థలిపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త :** వనస్థలిపురం, ఎన్జీవోస్ కాలనీ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమీపంలోగల శ్రీ ఎల్లమ్మ దేవి ఆలయంలో అమ్మవారి బోనాల ఉత్సవాలు ఈ నెల 4వ తేదీ ఆదివారం ఘనంగా నిర్వహించనున్న ట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, 8 గంటలనుండి రాత్రి 8 గంటలవరకు అమ్మవారికి అర్చనలు, బోనాలు సమర్పించుట, వడి బియ్యం సమర్పణ, సాయంత్రం 4.30 గంటలకు శ్రీ ఎల్లమ్మదేవి రథోత్సవం, బోనాల రథం ఊరేగింపు ఆలయ కమిటీ ఛైర్మన్ వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి నివాసమునుండి పోతురాజుల విన్యాసాల నడుమ ఫలహారపు బండి ఊరేగింపు బయలుదేరుతుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు.

## నాచారం డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పోరేటర్ శాంతి

**నాచారం, ఆగస్టు 1 ప్రభాతవార్త :** నాచారం డివిజన్ పరిధిలోని రామ్‌రెడ్డి నగర్‌లో రూ. 10లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భడ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే సీసీరోడ్డు పనులు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, రమణారెడ్డి, భూపాల్ రెడ్డి, విఠల్ యాదవ్, రాంచందర్, దాసరి కర్ణ, గణేష్, చంద్రశేఖర్, బుచ్చన్నగౌడ్, అనిల్, స్థానికులు రామ్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, నరసింహ్మ, మధుసూధన్‌రెడ్డి తధితరులు పాల్గొన్నారు.

**స్వంత ఖర్చులతో మరమ్మతులు : కార్పోరేటర్ శాంతిశేఖర్...** ఎర్రగుంటలోని నల్లపోచమ్మ ఆలయం ఆవరణంలో ఉన్న పవర్ బోరు పనిచేయకపోవడంతో కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ స్పందించి రూ. 35 వేల స్వంత ఖర్చులతో బోరుకు మరమ్మతులు చేయించి తన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జంగం అశోక్, ఆశన్న, వాసు, భిక్షపతితో పాటు పలువురు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు : చిలుక



కేటీఆర్, సబిత దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నా గణేష్‌నేత హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అబద్ధపు ఆరోపణలు చేయడానికి నిరసిస్తూ మాజీ మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డిల దిష్టిబొమ్మలను ఆర్కేపురం డివిజన్ బిజెఆర్ భవన్ మందు విజయవాడ జాతీయ రహదారిపై డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డిపైన అసత్య ప్రచారాలను చేస్తూ సిఎంను, కాంగ్రెస్ పార్టీని మోసం చేసి ఆనాడు బిఆర్ఎస్ పార్టీలో చేరి అధికార దాహంతో మంత్రి పదవి తీసుకున్నారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రిపై అసత్యఆరోపణలు చేస్తున్న సబిత మోసం అనే మాటకు పర్యాయ పదంగా మారిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి మధుసూధన్‌రావు, పగిళ్ల భూపాల్‌రెడ్డి, లక్ష్మీ, రేణుక, తలాటి రమేష్‌నేత, వంగూరి యాదవరెడ్డి, డక్కీయర్‌నాయక్, నానవాల జ్ఞానేశ్వర్‌యాదవ్, దుబ్బాక శేఖర్, పెద్దవూర సైదులు, శేఖర్‌ముదిరాజ్, అక్బర్, బొడ్డుపల్లి మహేందర్, లింగస్వామిగౌడ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



పోలీసు అదుపులో ఉన్న టిఆర్ఎస్ నాయకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిపై అసత్య ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సబితారెడ్డిపై అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేయడం పట్ల నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్న టిఆర్ఎస్ నాయకులను సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీలో సబితాఇంద్రారెడ్డి, సునీతలక్ష్మారెడ్డిలపైన అనుచిత వాక్యాలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని, మహిళలకు గౌరవం ఇవ్వలేని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సిగ్గు పడాలన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో గడ్డిఅన్నారం మార్కెట్ మాజీ చైర్మన్ పుట్టం పురుషోత్తంరావు, లోకసాని కొండల్‌రెడ్డి, గౌని శ్రీనివాస్‌గౌడ్, సలీం, పోలె అరవింద్, పోలె సుధామ, కట్ట ప్రవీణ్, ప్రత్యుష్, రాజుయాదవ్, సునీల్‌యాదవ్, కిరణ్, సాయినరేష్‌గౌడ్ ఉన్నారు.

## రాచకొండ పోలీస్ కమీషనరేట్ ఉద్యోగులకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ : సీపి సుధీర్‌బాబు



మెగా హెల్త్ క్యాంప్‌లో ఉద్యోగులకు చికిత్సలు నిర్వహిస్తున్న ఆసుపత్రి సిబ్బంది

**నేరెడ్‌మెట్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** పోలీసులు విధి నిర్వహణలతో పాటు తమ ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు తెలిపారు. గురువారం నేరెడ్‌మెట్ వాయుపురిలోని రాచకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో సుధీర్‌బాబు ఆధ్వర్యంలో డీసిపి అడ్మిన్ ఇందిర పర్యవేక్షణలో కమీషనరేట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది ఉచితంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో ఆరోగ్య పరీక్షలు, మాక్సివిజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, సైజన్య డెంటల్ ఆసుపత్రి వారిచే దంత పరీక్షలు నిర్వహించడం జరిగింది. కమీషనరేట్ కార్యాయంలో మినిస్ట్రీరియల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది బి.పి, షుగర్, ఈసిజి, 2డి ఎకో, డెంట్, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ డాక్టర్ సరిత, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు భద్రారెడ్డి, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు సాకెత్ (కార్డియో), డాక్టర్ రాధిక (జనరల్ మెడిసిన్), భద్రత పి.ఆర్.వో, శివ, మ్యాక్సి విజన్ ఆప్తమాలజిస్ట్ శివాజి, శ్రీలేఖ, అమీన్, మహేందర్, సౌజన్య, దంత ఆసుపత్రి వైద్యులు లిఖిత, డాక్టర్ వైష్ణవి, మార్కెటింగ్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## గుంతల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

వార్త ప్రభావం



మరమ్మతులు చేస్తున్న జిహెచ్ఎంసి మున్సిపల్ సిబ్బంది

**ఎల్.బి.నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ప్రజల ఇబ్బందులను గుర్తించి ఎట్టకేలకు ఇంజనీరింగ్ విభాగం అధికారులు గుంతల మయంగా మారిన రోడ్డుకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. 'గుంతల మయంగా మారిన రోడ్డు వాహనదారుల ఇబ్బందులు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు' పేరిట బుధవారం వార్తలో ప్రచురితమైన కథనానికి జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పెట్టకేలకు స్పందించారు. నాగోలు డివిజన్ బండ్లగూడ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డుతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వార్తలు ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాత్కాలికంగా మరమ్మత్తులు చేపడుతున్నామని హయతనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు. వర్షాలు తగ్గిన అనంతరం నూతన రోడ్డు నిర్మాణం పనులు చేపడుతామని తెలిపారు.

## సీసీరోడ్ల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలి : కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



రోడ్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే సీసీరోడ్ల మరమ్మతు పనులను చేపట్టి పూర్తిచేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ గాంధీబొమ్మ వీధిలో పర్యటించిన కార్పొరేటర్ అక్కడి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధిలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పునర్నిర్మాణ పనులు పూర్తయి నెలరోజులు గడుస్తున్నా సీసీరోడ్ల మరమ్మతులు పూర్తి చేయకపోవడంతో రోడ్లు అధ్వాన్నంగా మారాయన్నారు. వర్షానికి రోడ్లు బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు, పాదచారులు నడవడానికి అనువుగా లేక బస్తీవాసులతో పాటు వీధిలోని వ్యాపారస్తులకు కూడా ఇబ్బందులు మారిందన్నారు. అనంతరం కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి రోడ్లపై ఉన్న మట్టిని డోజర్ సహాయంతో తొలగించేలా చర్యలు తీసుకున్నారు. సీసీరోడ్ల మరమ్మతు పనులను వెంటనే పూర్తిచేయాలని జలమండలి డీజీఎం మాదవికి సూచించారు.

## అల్మాస్‌గూడలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో గురువారం బోనాల మహోత్సవం ఘనంగా జరిగింది. ప్రతి సంవత్సరం హైదరాబాద్ పాతబస్తీ బోనాల తర్వాత వచ్చే తొలి గురువారం రోజు ఇక్కడి ప్రజలు బోనాలు జరుపుకోవడం ఆచారంగా వస్తున్నది. ఈ క్రమంలో అల్మాస్‌గూడ గ్రామ, కాలనీల ప్రజలు భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. బోనాలకు మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరై పోచమ్మ అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చప్పిడి సంతోష్‌రెడ్డి, కుంచె నాగేందర్‌గౌడ్, నవారు మల్లారెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత : మున్సిపల్ అధికారులు

**ఉప్పల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో అనుమతికి విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాలను గురువారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. భగాయత్ పరిధిలో అనుమతికి మించి అధనంగా అంతస్థులు నిర్మిస్తుండడంతో అధికారులు కూల్చివేశారు. డిప్యూటి కమిషనర్ అంజనేయులు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ ఎసిపి వెంకటరమణ, టిపిఎస్ సురేష్, ఇతర సిబ్బంది కూల్చివేతలలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రాజు, విజయ్, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్‌లో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు

**సరూర్‌నగర్, ఆగస్టు 1 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్ 27వ డివిజన్ సిర్లాహిల్స్ కాలనీ అంగన్‌వాడి కేంద్రంలో గురువారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్లు పసునూరి బిక్షపతిచారి, అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్‌లు తల్లి పాల ప్రాముఖ్యత గురించి మహిళలకు అవగాహన కల్పించడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, అంగన్‌వాడి టీచర్ అరుణ, కవిత, ఎంపిహెచ్ఎ బాలమణి, ఆశా వర్కర్లు కవిత, భాగ్యలక్ష్మి, పలువురు తల్లులు, గర్భిణీలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : రజితరెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నామని ఉప్పల్‌డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వార్డు కార్యాలయంలో ప్రజల నుంచి పలు ఫిర్యాదుల స్వీకరించి వాటిని పరిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల నిర్వహకులు వేడుకలకు రావాలని ఆహ్వానించారు.

## హబ్సిగూడ డివిజన్ అభివృద్ధికి కృషి : చేతన

**రామంతాపూర్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్‌లో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మధురానగర్ పార్కులో పచ్చదనం పెంచేందుకు గార్డెనింగ్ ఏర్పాటు,మొక్కల పెంపకం గురించి యుబిడి డిప్యూటి డైరెక్టర్ చంద్రశేఖర్, ఎఇ నర్సింహారావులతో చర్చించారు. కామాక్షిపురం, వెంకట్‌రెడ్డినగర్‌లో డ్రైనేజీ సమస్య ఉందని చెప్పడంతో జలమండలి అధికారులతో పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. డ్రైనేజీ సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జల మండలి మేనేజర్ రవీందర్, డివిజన్ కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, కె.లింగం, అంజిరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడ డివిజన్ అభివృద్ధికి కృషి : చేతన

**రామంతాపూర్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్‌లో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆమె అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మధురానగర్ పార్కులో పచ్చదనం పెంచేందుకు గార్డెనింగ్ ఏర్పాటు, మొక్కల పెంపకం గురించి యుబిడి డిప్యూటి డైరెక్టర్ చంద్రశేఖర్, ఎఇ నర్సింహారావులతో చర్చించారు. కామాక్షిపురం, వెంకట్‌రెడ్డినగర్‌లో డ్రైనేజీ సమస్య ఉందని చెప్పడంతో జలమండలి అధికారులతో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జల మండలి మేనేజర్ రవీందర్, డివిజన్ కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, కె.లింగం, అంజిరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.